

ధాన్యం కొను'గోల్లు'



తడిసిన ధాన్యం చూపుతున్న రైతు

ఎల్లారెడ్డిపేట కేంద్రంలో ఆరబోసుకున్న ధాన్యం

- రైతులను వెంటాడుతున్న అకాల వర్షాల భయం
- జిల్లాలో 231 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- ఇప్పటివరకు 119 కేంద్రాలు ప్రారంభం
- ఒక్క కేంద్రంలోనే ధాన్యం తూకం
- జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎంతో శ్రమించి పండించిన ధాన్యం అమ్ము కోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడ్డ రైతులు చేతికి వస్తున్న పంటను అకాలవర్షాల నుంచి కాపాడుకొని, అమ్ముకోవడానికి నానా తిప్పలు పడక తప్పదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ వరి కోతలు ఒకవైపు జోరుగా సాగుతుండగా కొనుగోలు కేంద్రాల వద్దధాన్యం ఆరబోసుకోవడానికి స్థలం లేక వేగంగా కొనుగోలు మొదలుకాకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారు. ఈసారి సీజన్ ప్రారంభంలో నైరుతి ముఖం చాటేసినా అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో కొంత ఊరట లభించినా వరికోతల సమయంలో అధిక వర్షాలు నష్టాలను మిగిల్చాయి. చేతికి వస్తున్న పంటను కొనుగోలు కేంద్రాలవద్ద ఆరబోసు వడానికి వీలు లేక పోవడంతో రోడ్లను కల్లాలుగా మార్చి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు.

● దిగుబడి అంచనా 4.54 లక్షల మెట్రిక్ టన్నులు

వానాకాలం సీజన్‌లో 2.35 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, వరి 1.84 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. జిల్లాలో వరిసాగు ప్రకారం 4.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనాలు వేశారు. ఇందులో స్థానికంగా ధాన్యం వినియోగించుకోవడం, మిల్లర్లు నేరుగా కొనుగోళ్లు 1.84లక్షల మెట్రిక్ టన్నులు మినహాయించి మిగతా 2.70లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ ద్వారా కొనుగోలు చేయనున్నారు. దీనికి అనుగుణంగా కొనుగోళ్లు ప్రారంభిస్తున్నారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా, 231 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక వేశారు. ఇందులో ఐకేపీ ద్వారా 144 కేంద్రాలు, సింగిల్‌విండోల ద్వారా 79 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఒకటి, మెప్మా ద్వారా 7కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయించి బుధవారం వరకు జిల్లాలో 119కేంద్రాలు ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ద్వారా 78 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 36 కేంద్రాలు, మెప్మా ద్వారా 5 కేంద్రాలు ప్రారంభించారు. అక్టోబరులో 47,584 మెట్రిక్ టన్నులు ధాన్యం మార్కెట్‌లో వస్తుందని అందులో పౌరసరఫరాల శాఖ ద్వారా 5వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరుగుతుందని అంచనాలు వేశారు.

నవంబరులో 3,41,060 మెట్రిక్‌టన్నుల్లో 1.80లక్షల మెట్రిక్‌టన్నులు, డిసెంబరు లో 65,622 మెట్రిక్ టన్నుల్లో 80వేల మెట్రిక్ టన్నులు, 2026 జనవరిలో 5వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ 500 బోనస్ ఇస్తున్న క్రమంలో రైతులు..

- మిగతా 8లో

జిల్లాలో వరి సాగు ఇలా.. (ఎకరాల్లో)

మండలం	మొత్తంసాగు	వరి
గంభీరావుపేట	18598	18500
ఇల్లంతకుంట	36970	24000
ముస్తాబాద్	23835	23000
సిరిసిల్ల	5623	4800
తంగళ్లపల్లి	21086	20100
వీర్నపల్లి	8300	8000
ఎల్లారెడ్డిపేట	21100	17500
బోయినపల్లి	19167	12600
చందుర్తి	21367	15100
కోనరావుపేట	23140	18300
రుద్రంగి	10964	5910
వేములవాడ	10038	5200
వేములవాడ రూరల్	15142	11300
మొత్తం	235330	184310

- మిగతా 8లో

గడువులోగా సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ లక్ష్యం గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. 2024- 25 ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ లక్ష్యంపై జిల్లాలోని రైస్ మిల్లర్లతో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లో 4,79,922 టన్నుల ధాన్యం దిగుమతి చేసుకున్నారని, దీనికి 3,24,801.263 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 1,36,711.466 టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇచ్చారన్నారు. ఇంకా 1,88,089.799 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లందరూ వారికి కేటాయించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అందజేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలోని మిల్లుల వారీగా ఇచ్చిన లక్ష్యం, వారు పూర్తి చేసిన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వడంలో వెనుకబడిన మిల్లును గుర్తించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని, ఆయా మిల్లులను నిత్యం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే రైస్‌మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్‌మిల్లర్లు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. జిల్లాలోని రైస్‌మిల్లుల యజమానులందరూ సమన్వయంతో ప్రభుత్వం అందించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని వివరించారు. లారీల కాంట్రాక్టర్లు తాము ఇచ్చిన సంఖ్యకు అనుగుణంగా వాహనాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాష్, రైస్‌మిల్లుల యజ మానులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా గరిమా అగర్వాల్..

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా గరిమా అగర్వాల్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ప్రసాద్ జగిత్యాల కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిపోవడంతో ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఆ పోస్ట్‌కు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న గరిమా అగర్వాల్‌ను జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ



రుద్రవరంలో హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రజిత

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిష్టర్ పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలని హెచ్చరించారు. కేంద్ర ఆరోగ్య పథకాల అసంక్రమితవ్యాధులు టీబీ, ఎంసీహెచ్, 60 ఏళ్లపైబడిన వృద్ధులకు అందించే ఆరోగ్య సేవల రికార్డులను పరిశీలించారు. అయోడైజ్డ్ ఉప్పు ఉపయోగించడం వల్ల థైరాయిడ్ సమస్యలు నివారించవచ్చని, మాతాశిశు సంరక్షణలో గర్భిణులను గుర్తించి రికార్డులలో నమోదు, గర్భిణులకు చెకప్ అందించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేట్లు ప్రోత్సహించాలని సూచించారు.

ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ 14వ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విమల మాట్లాడుతూ హైదరాబాద్‌లో జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు ఐద్వా 14వ జాతీయ మహాసభలు జరుగుతాయని, మహాసభలకు జిల్లానుంచి అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, దాసరి రూపా తదితరులు పాల్గొన్నారు.

జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

తంగళ్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో వినోద్ తనిఖీ చేశారు. బుధవారం డీఈవో పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అలాగే పదో తరగతిలో జరిగే పాఠ్యబోధనను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ, వార్షిక ప్రణాళిక సిలబస్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎంఈవో బుక్య రాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రమేష్, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయిప్రణీత్, శైలజ, శిరీష, నీరజ తదితరులు ఉన్నారు.

28న యువ కళాకారుల ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో ఈనెల 28న యువ కళాకారుల ఎంపికల పోటీలను నిర్వహిస్తున్నట్లు బుధవారం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. స్థానిక మినీ స్టేడియంలో ఈనెల 28న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలకు వరకు పోటీలు ఉంటాయని, 15నుంచి 29 ఏళ్లలోపు వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువతీయువకులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని తెలిపారు. వికసిత్ భారత్ యూత్‌లీడర్ డైలాగ్,స్టేజీ-2లో ఆన్‌లైన్ ఎస్సే రైటింగ్, స్టేజీ-3 వికసిత్ భారత్ పీపీటీ చాలెంజ్, స్టేజీ-4 వికసిత్ భారత్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేవారు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

8

త్వరలో మున్నూరుకాపుల సింహ గర్జన

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



సభ్యత్వ బుక్‌లను ఆవిష్కరిస్తున్న కొండ దేవయ్య తదితరులు

గంబీరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : త్వరలో మున్నూరు కాపుల సింహగర్జన నిర్వహిస్తామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య వెల్లడించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి మున్నూరు కాపుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొండ దేవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపు జనాభా లెక్క తేల్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించి కుల గణన సర్వేలో మున్నూరు కాపుల సంఖ్య తక్కువగా ఉందని, అందుకే సభ్యత్వ నమోదు ద్వారా ప్రభుత్వాలకు వివరిస్తామన్నారు. మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రాల్లో సంఘ భవనాలను నిర్మించాలన్నారు. అందులో భాగంగానే పెద్ద ఎత్తున మున్నూరు కాపుల సింహగర్జన సభను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మేకర్తి భిక్షపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కల్లూరి చందన, నాయకులు ఎర్ర నర్సయ్య, గంట అశోక్, కిరణ్‌బాబు, బోయన్నగారి లింగం, వేశాల వెంకటి, హన్మండ్లు తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మున్నూరు కాపుల అభ్యున్నతికి పాటుపడుతానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆ సంఘం భవనంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని సంఘం సభ్యుల సభ్యత్వ నమోదును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఐక్యతతో ముందుకు సాగి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమురయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి వాణి, జిల్లా అధ్యక్షురాలు చందన, నాయకులు కిషన్, బాల్‌రెడ్డి, కుమార్, దేవరాజు, హరీష్, మల్లేశం, పోశెట్టి, నర్సయ్య, రామచంద్రం, లింగం, లక్ష్మణ్, శ్రీధర్, రవి, నారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- ఓపెన్ హౌస్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ చంద్రయ్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ వీరప్రసాద్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్ అంటే ఏమిటనేది తెలిసి ఉండాలని, ఇందుకోసమే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కృష్ణ, ఆర్ఐ యాదగిరి, ఆర్ఎస్ఐలు శ్రావణ్, దీలీప్, పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేములవాడ క్రైం : పోలీసులు, ప్రజల మధ్య నమ్మకాన్ని పెంచడానికే ఓపెన్‌హౌజ్ నిర్వహించామని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. బుధవారం పోలీస్ అమవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసు విధులు, వారి బాధ్యతలపై అవగాహన పొందారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత అనే అంశాలపై ప్రదర్శన చేసి అవగాహ న కల్పించారు. ఆర్ఎస్ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసుల విధులు, అందిస్తున్న సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై లక్పతి, వాణీనికేతన్ హైస్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి, శోభ, కళ్యాణి, రేణుక పాల్గొన్నారు.

● రుద్రంగి : చట్టాలు, నేరాలపైన విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీస్ అమరవీరులు సంస్కరణ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాస్ విద్యార్థులతో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎఎస్ఐ గంగారాజం, పోలీస్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి : సమాజంలో పోలీసుల పాత్ర వెలకట్టలేనిదని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మణ్ విద్యార్థులకు వివరించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్సై ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఘనంగా స్వేరోస్ డే..



బహుమతులు పొందిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం గీతానగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వేరోస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికి ఉచితంగా పెన్స్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మారుపాక రాజు మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ సామాజిక న్యాయం, సమానత్వం, బహుజన అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయడన్నారు. దళిత, గిరిజన, వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడిన సేవామూర్తి అన్నారు. అధికారంలో ఉన్నా ఆయన మనస్సు ఎప్పుడూ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలు ఆశయ సాధన దిశవైపే ఉండేదన్నారు. ఎస్ఆర్ శంకర్ దూరదృష్టి సేవా తపనతోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గురుకుల విద్యా వ్యవస్థ ప్రారంభమైందన్నారు. విద్యా ద్వారానే పేద పిల్లల జీవితాలు మారుతాయని విశ్వసించిన శంకరన్ ఆలోచనల నుంచి జన్మించింది ఈ గురుకుల వ్యవస్థ అని అన్నారు. గురుకులాల వ్యవస్థ నుంచి పుట్టిందే స్వేరోస్ నెట్‌వర్క్ అని అన్నారు. శంకరన్ పుట్టిన రోజు అక్టోబరు 22న స్వేరోస్ డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌రెడ్డి, స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడు భట్టు శ్రీకాంత్, జిల్లా సలహాదారుడు ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ముగ్గురి అరెస్టు

కోరుట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని బర్ల కొట్టం సమీపంలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి సాగు చేస్తున్న గంజాయితో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టణంలోని హాజీపురకాలనీలోని బర్ల కొట్టం సమీపంలోని చెట్ల పొదల్లో గంజాయి సాగు చేస్తున్న విషయం తెలుసుకున్న కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్‌ఐ చిరంజీవి తనిఖీలు నిర్వహించారు. సాగు చేస్తున్న గంజాయిని వ్యవసాయ అధికారి నాగమణి సమక్షంలో పరిశీలన జరిపి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్ తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చిగురుమామిడి,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట గ్రామంలో బుధవారం వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు బావుల వద్ద పేకాట ఆడుతన్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ. 1700 నగదు దొరికినట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, గంజాయి విక్రయించినట్లు ఉన్నా సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని అన్నారు.

వెల్గటూర్ : మండలంలోని చెగ్యాం గ్రామ శివారులో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం చెగ్యాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ పోలీసులు, వెల్గటూర్ పోలీసుల ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద లభించిన రూ.58 వేలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రంగసాగర్ వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం

బీర్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామ శివారులోని గోదావరి నదిలో ఐళ్ల మడుగు వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని గుర్తించిన గ్రామ కార్యదర్శి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ జిల్లా చేపూర్ గ్రామానికి చెందిన కనికారపు సుజాత సంఘటన స్థలానికి చేరుకుని ఇతను తన భర్త కనికారపు గంగాధర్ అని తెలిపారు. గంగాధర్ బావ మరిది గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోగా మృతుని శవాన్ని వెతికేందుకు గంగాధర్ గోదావరి నదిలోకి వెల్లగా వరద ప్రవాహం ఎక్కువై ఆ ప్రవాహంలో తన భర్త కొట్టుకు పోయాడని పేర్కొంది. పోలీసులు మృతదేహనికి పంచనామా నిర్వహించి భార్యకు అప్పగించారు. మృతుడి భార్య తెలిపిన వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా



పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
50 చలాన్ల పైబడినవి 301 వాహనాలు
వాటిపై రూ.64.39 లక్షల జరిమానా

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనల అమలును మరింత కఠినతరం చేయాలని సీపీ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. పెండింగ్ చలాన్ల వసూలులో భాగంగా స్పెషల్ డ్రైవ్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. ఇప్పటి కే కమిషనరేట్ వ్యా ప్తంగా 50 చలాన్ల పైఉన్న 301 వాహనాలను గుర్తించారు. ఈ వాహనాలపై రూ.64 లక్షల 39 వేల 715 జరిమానా పెండింగ్‌లో ఉంది. కమిషనరేట్ వ్యాప్తం గా అక్టోబరు 17వ తేదీ నాటికి మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలకు 50 సార్లు, ఆపై పాల్పడి జరిమానా చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులను పట్టుకొని చలాన్, జరిమానా వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 100 ఆపై వరకు పెండింగ్ చలాన్లు ఉండి జరిమానా చెల్లించని వాహనాలు 60 వరకు ఉన్నాయి. వాటిపై ఉన్న జరి మానా మొత్తం 21 లక్షల 83 వేల 875 రూపాయ లుగా గుర్తించారు. 50 నుంచి 100 వరకు పెండింగ్ చలాన్లు కలిగిన 241 వాహనాలను గుర్తించారు. వాటి జరిమానా మొత్తం 42 లక్షల 55 వేల 840 రూపాయలు.



స్పెషల్ డ్రైవ్

పెండింగ్ చలాన్లు వసూలు చేసేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తక్షణమే రంగంలోకి దిగాలని సీపీ ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు, వాహనదారులు లేకుండా చూడాలని, ఈ విషయంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. దీంతో కొద్ది రోజులుగా కమిషనరేట్ వ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

వాహనాలను స్వాధీనం చేసుకుంటాం
గౌస్ ఆలం, పోలీస్ కమిషనర్



పెండింగ్ చలాన్లు కలిగిన వాహన దారులు తక్షణమే చెల్లించాలి. లేనట్లయి తే తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. కమిషనరేట్ లో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు లేకుండా చూడాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.

ద్విచక్రవాహనం అదుపు తప్పి అంగన్‌వాడీ ఆయా మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా దొబ్బల మరియ(58) దుర్మరణం చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని సమీప బంధువు మృతి చెందడంతో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా మరియ తన చిన్నకొడుకు ప్రభాకర్‌తో కలిసి బైక్‌పై వస్తోంది. అక్కపల్లి గ్రామ శివారులో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాల పాలైన మరియను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు మహేశ్, ప్రభాకర్‌లు ఉన్నారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.



మరియ(ఫైల్)

నేరెళ్ల వద్ద బైక్ పైనుంచి పడి మృతి

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వేముల పుష్ప (50) అనే మహిళ బుధవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామానికి చెందిన పుష్ప మరో మహిళ కాసారపు గౌరమ్మ పత్తి ఏరి కాసారపు సంతోష్‌కు చెందిన టీఎస్ 02 ఈబీ 5912 అనే నెంబర్ బైక్ పైన ఇంటికి బయలు దేరారు. సరిగా రోడ్డు పైకి వచ్చే సరికి బర్రెలు అడ్డురావడం వల్ల బైక్ పైనుంచి కింద పడి పుష్ప మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు జగిత్యాల మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు బుధవారం వన్‌టౌన్‌లో సీఐ రాంచందర్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీటర్ల సత్ప్రవర్తనతో ఉండాలని, నేరఘటనల్లో పాల్గొనవద్దని సూచించారు. కొంతకాలంపాటు సత్ప్రవర్తనతతో మెదిలిన వారి రికార్డులను పరిశీలించిన తరువాత షీట్‌ల ఎత్తివేతకు సిఫారసు చేసే అవకాశముందన్నారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై పోలీసు నిఘా నిత్యం ఉంటుందని హెచ్చరించారు. నేరఘటనల్లో జోక్యం చేసుకుంటే వ్యక్తిగతంగానూ, సమాజపరంగానూ మరిన్ని సమస్యలు ఎదురవుతాయన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్సై భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

జగిత్యాలరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాతో పాటు నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈనెల 13న జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామంలో నాలుగు ఇళ్లలో తెల్లవారుజామున తాళాలు పగులకొట్టి బంగారు, వెండి, నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు దొంగల కోసం గాలింపు చేపట్టి మహారాష్ట్రకు చెందిన మ్యాకల్‌వర్ సాయినాథ్, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన ముండె శ్రీకాంత్, మైనర్ బాలుడిని బుధవారం ధరూర్ బైపాస్ రోడ్డులో కారులో వెళ్తుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. కొంతకాలంగా ఈ ముఠా జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరి నుంచి 24.5 గ్రాముల బంగారం 19 వేల నగదు, ఓ కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాకు చెందిన మహారాష్ట్రలోని హింగోళి జిల్లాకు చెందిన మార్కులే అనిల్‌తో పాటుగా మరికొంతమంది పరారీలో ఉన్నారని, వీరిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.



దొంగల ముఠా అరెస్ట్ చూపుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగల వంతెన వద్ద కారు ఢీకొని 'ఆంధ్రజ్యోతి' ఉద్యోగి కాల్వ శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం తీగల వంతెన సమీపంలోని ఐలాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు శంకర్‌ను ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని కారు నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ పైనుంచి దూకి ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి బాబు(30) అనే వ్యక్తి బుధవారం రాత్రి సెల్‌టవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబు మామిడిపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. కొన్ని రోజుల క్రితం గల్ఫ్‌దేశం వెళ్లి ఈ మధ్యనే ఇంటికి వచ్చాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



బాబు(ఫైల్)

ఇరాక్‌లో పెగడపల్లి వాసి మృతి

పెగడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది గంటల్లో విమానం ఎక్కి ఇరాక్ నుంచి స్వస్థలానికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుతో పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి (నిమ్మని) రమేష్ (55) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. బతుకుదెరువు కోసం రమేష్ ఏడాది క్రితం ఇరాక్ వెళ్లాడు. అక్కడ విధులు నిర్వహిస్తూ బుధవారం స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. మంగళవారం రాత్రి గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించేలోపే రమేష్ మృతిచెందినట్లు స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు, కూతురు ఉన్నారు. రమేష్ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రమేష్ (ఫైల్)

రాజీవ్‌రహదారి పక్కన గుర్తు తెలియని బైక్

● కొన్ని రోజులుగా ఒకే చోట ఉన్నట్లు గర్తింపు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో డైట్ కళాశాలకు ఎదురుగా రాజీవ్ రహదారి పక్కన ఓ ద్విచక్ర వాహనం కొన్ని రోజులుగా ఒకే చోట ఉంది. అయితే అ బైక్ ఎవరిది, ఇందుకు ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలేని వెళ్లారనే సందేహం వ్యక్తం అవుతోంది. బైక్ ముందు వైపు ఏపీ 37 ఏఫై 2219 నెంబర్ ప్లేట్ ఉండగా, వెనుక వైపు నంబర్ లేదు. అయితే ఈ వాహనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010లో రిజిస్ట్రేషన్ అయినట్లు తెలుస్తున్నది. ఏపికి చెందిన ఈ వాహనం ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలి వెల్లడంపై అనుమలకు దారి తీస్తోంది. వాహనం పాడై ఇక్కడే వదిలేసి వెళ్లారా, లేదా ఎవరైనా బైక్‌ను దొంగిలించి ఇక్కడ వదిలి వెళ్లారా అనే , లేదా ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. ఎప్పుడు, ఎవరు, ఎందుకు ఈ బైక్‌ను రాజీవ్ రహదారిపై వదిలి వెళ్లారు, బైక్ వదిలి వెళ్లిన వారు ఎవరై ఉంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై పూర్తి స్థాయిలో దార్యాప్తు చేస్తే విషయం బయటికి వచ్చే అవకాశం ఉన్నది.



రాజీవ్‌రహదారి పక్కన నిలిపిన బైక్

పొలాస ఏపీటీ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర సందర్శనలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ స్వాతి సూచనల మేరకు పొలాస అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. టీచింగ్ అసోసియేట్ అశ్ఫక్ నేతృత్వంలో పార్టిసిపేటరీ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌లో వివిధ విభాగాల పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు.



వ్యవసాయ మార్కెట్‌లో విద్యార్థులు

కొనుగోళ్లు, అమ్మకాల ప్రక్రియ, అడ్తిదారులు, కమిషన్ విధానం, ఈ నామ్ విధానం, ఏ ధాన్యాలు, కొనుగోళ్లు, ఎంత ధరకు కొనుగోలు చేస్తారనే తదితర అంశాలపై విద్యార్థులు మార్కెట్ అధికారులను, అడ్తిదారులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. టీచింగ్ అసోసియేట్ పూజితతో పాటు అడ్తిదారు నలువాల తిరుపతి, ఏపీటీ కళాశాల విద్యార్థులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన వంగ రాయమల్లు అనే వ్యక్తి అతని మనుమరాలుతో సహా మోటారు సైకిల్‌పై వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా చెంజర్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చందుర్తి వద్ద ఒకరికి..

చందుర్తి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ-చందుర్తి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన మోతె రాములు బైక్‌పై వెళతుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. రాములకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందిచారు. చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది వెంకటరెడ్డి, చాణక్య తెలిపారు.

ఇసుక టాక్టర్ల పట్టివేత

వీణవంక, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తన్న నాలుగు టాక్టర్లను పోలీసులు పటుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొర్కల్ గ్రామానికి చెందిన కొందరు టాక్టరు యజమానులు ప్రభుత్వం నుంచి ఎలాంటీ అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తుండగా పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పాఠశాలలోకి పాము

ఎలిగేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాము చొరబడింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఏడాది క్రితం పాఠశాలను ఆనుకొని వన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుండటంతో తరుచుగా పాములు, విషపురుగులు తరగతి గదుల్లోకి వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పాములు మూడుసార్లు తరగతి గదుల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నర్సరీని పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం వేణుకుమార్‌ను వివరణ కోరగా నర్సరీ మూలంగా విషసర్పాలు తరుచుగా వస్తున్నాయని పిల్లలు జంకుతున్నారని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటలో బుధవారం తెల్లవారుజామున ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. ఆలయాల తాళాలు పగులగొట్టి హుండీని ధ్వంసం చేశారు. అమ్మవారలపై ఉన్న పుస్తెలు, ముక్కు పుడక, మట్టెలు, మంగళసూత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్తీ సిరప్‌పై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ సిరప్‌లు ఇచ్చి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పెద్దపల్లి పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన చిరంజీవి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీవాణికి ఫిర్యాదు చేశారు. రెండురోజులు క్రితం చిరంజీవి తన కుమారుడు అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ఒక పిల్లల డాక్టర్ వద్దకు చికిత్స కోసం తీసుకువెళ్లానని తెలిపారు. అక్కడ డాక్టర్ పరీక్షించి సిరప్‌తో పాటు టాబ్లెట్లు రాశారని పేర్కొన్నారు. ఆసుపత్రి పక్కనే గల మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేశానని తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత సిరప్ మూతతీసిన తర్వాత అందులో ఏవేవో తేలియాడుతూ కనబడ్డాయని, ఆ సిరప్ పిల్లలకు తాగిస్తే ప్రాణం పోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిరప్‌ను తీసుకునివెళ్లి మెడికల్‌షాపు యజమానిని ప్రశ్నిస్తే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వోతో పాటు డ్రగ్‌ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశానని చిరంజీవి పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పట్టణంలోని రాథోడ్ నాందేవ్ అనే ఉపాధ్యాయుడు తాను అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి శనివారం స్వంత గ్రామానికి వెళ్లాడు. గ్రామం నుంచి వచ్చిన ఆయన బుధవారం వచ్చి ఇంటి తాళం తెరచి ఇంటి లోపలికి వెళ్లి చూసే సరికి బీరువా తెరచి, సామాన్లు చిందర వందర చేసినట్లు గుర్తించారు. అలాగే బీరువాలో దాచి ఉంచిన రూ. 15,000 నగదు, అరతులం బంగారం వచ్చిన వ్యక్తులు అపహరించారు. అదే విధంగా జర్మనీలో ఉంటున్న కొరిడె సత్యన్న ఇంటి తాళాలు కోసి చోరీకి విఫలయత్నం చేసినట్లు తెలుస్తుంది. సత్యన్న ఇంటిలో తులంనర బంగారం, వెండి పంచపాల చోరీ జరిగినట్లు తెలుస్తుంది, జర్మనీ నుంచి సత్యన్న వస్తే ఇంటిలో ఇంకా ఏమి దొంగిలించారో అనేది తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

● చెట్ల పొదల్లో ఆలయ హుండీ

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ స్టేజీ నుంచి కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెట్ల పొదల్లో ఆలయానికి సంబంధించిన హుండీ పడేసి ఉన్నది. ఇదే గ్రామానికి చెందిన శ్యామకూర సంపత్‌రెడ్డి చెట్ల పొదల్లో ఉన్న హుండీని గమనించారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్సై సాయికృష్ణకు సమాచారం అందించినాడు. అక్కడికి చేరుకున్న ఎస్సై హుండీ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు హుండీ చోరీ జరిగినట్లు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు. ప్రస్తుతం హుండీని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.



ధర్మపురిలో తెరిచి ఉన్న బీరువా



చెట్ల పొదల్లో పడేసిన హుండీ

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

ముత్తారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాస్ తారక దంప తుల కూతురు అభిజ్ఞ(18నెలలు) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ మేరకు చిన్నారికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కాగా ఆ పాప ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మళ్లీ అదే ఆసుపత్రికి బుధవారం చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లారు. దీంతో వైద్యులు ఇంజెక్షన్ వేసి, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. కాగా ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి చిన్నారికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యు లు చిన్నారి మృతిచెందినట్లు తెలిపారు. దీంతో అభిజ్ఞ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతిచెందినట్లు ఆరోపించారు. తమ కుమార్తె ప్రాణాలు తీసిన సదరు ఆసుపత్రి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ ఘటనతో లక్కారం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రేపు యాదవులకు రాజకీయ శిక్షణ తరగతులు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఉమ్మడి జిల్లాలోని యాదవ కులస్తులకు అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సొగని కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శుక్రవారం రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని రామకృష్ణ కాలనీలో యాదవ సంఘం భవనంలో సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. మానకొండూర్ మండలం ఖాదర్‌గుడెంలోని ఫామ్ అరవింద ఫామ్‌లో రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఆవుల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్మంలో నందవేణి ప్రసాద్, బాబుర్ కుమార్, జంగా శ్రీనివాస్, నరసయ్య, పోలం అంజయ్య, ఆవుల అంజయ్య, హనుమంతు, వేల్పుల ఓదెలు, భూపతి, గోపాల్, పోలం మల్లేష్, రాజయ్య, రమేష్, సంపత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యాదవుల సంఘం నాయకులు

ఘనంగా సామూహిక కార్తీక దీపోత్సవం



భీమేశ్వర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వ ర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. రాజన్న దేవాలయ సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమం ప్రతీ రోజు రాత్రి నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాశ్వత ఆకాశ దీపం ప్రారంభించిన అర్చకులు..

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస దీపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నెలరోజుల పాటు వెలిగే శాశ్వత ఆకాశ దీపాన్ని ఆలయ అర్చకులు ప్రతిష్ఠించారు.

గోదావరికి ఘనంగా హారతి



గోదావరి నది వద్ద గంగాహారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. గోదావరి నది వద్ద హారతి కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, భక్తులు హారతి ఇచ్చి నదిలో దీపాలు వదిలి పెట్టారు. రామలింగేశ్వర, అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి వారలకు, అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు..



నిరుపయోగంగా ఉన్న నూతన కూరగాయల మార్కెట్

- రూ. 2.90 కోట్లతో నిర్మించినా..
- రోడ్లపక్కనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు
- రెండో బైపాస్ రోడ్డులో పొంచివున్న ప్రమాదం



రెండో బైపాస్‌లో నిర్మిస్తున్న షెడ్లు

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. వేములవాడ పట్టణంలో రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుగా అప్పటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్ ఎదురుగా గర్ల్స్ హైస్కూల్ పక్కన పదివేల అడుగుల విస్తీర్ణంలో సుమారుగా రూ.2.90 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. నూతన భవనంలోకి వ్యాపారులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. మార్కెట్ భవన నిర్మాణం రెండు సంవత్సరాల క్రితం పూర్తయినప్పటికీ ప్రారంభంలో ఆలస్యం జరిగింది. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అప్పటి మంత్రి చేతుల మీదుగా కూరగాయల మార్కెట్ భవనాన్ని ప్రారంభించారు.

అయితే ఇప్పటివరకు రైతులు, వ్యాపారులకు స్టాల్స్ కేటాయించలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు స్టాల్స్ కేటాయించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానించినా వ్యాపారులు చొరవ చూపకపోవడంతో పది మంది మాత్రమే ముందుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులు, రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో బైపాస్‌లోని రోడ్డు పక్కన రైతులు తాత్కాలిక షెడ్లు వేసుకుని కొంత మంది, మరికొంత మంది రోడ్డుపక్కన, రోడ్డుపైన కూరగాయల విక్రయిస్తున్నారు. రెండో బైపాస్ రోడ్డులో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతాయి. దీంతో భారీ వాహనాలు వెళ్లే క్రమంలో రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటంతో భవనం దెబ్బతినే పరిస్థితి ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సమయంలో తరలింపు..

ఉప్పుగడ్డ వీధిలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను కరోనా సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అక్కడినుంచి తరలించారు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండులోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోకి తరలించారు. మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో కూరగాయల వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో రెండవ బైపాస్ రోడ్డులోని మూలవాగు ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేయగా మరికొందరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణంలోని కోరుట్ల బస్టాండు సర్వాయిపన్న విగ్రహం వద్ద తెల్లవారు జామున ఉదయం 4 గంటల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి రోడ్డుపైన విక్రయించడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

68 షెడ్ల నిర్మాణం..

వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కూరగాయల మార్కెట్‌లోకి రైతులు, వ్యాపారులు వెళ్లేందుకు మొగ్గు చూపలేదు. గత ప్రభుత్వం తమ అభిప్రాయం తెలుసుకోకుండా కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టిందని, భవనం కూరగాయలు విక్రయించేందుకు అనువుగా లేదని రైతులు, వ్యాపారులు అందులోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో రైతుల, వ్యాపారుల నిర్ణయం మేరకు రెండో బైపాస్‌రోడ్డులో మూలవాగు పార్కును ఆనుకుని కూరగాయల విక్రయానికి షెడ్ల నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో రూ.86 లక్షలతో 68షెడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తికాగా, మిగిలిన పనులను నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు.



రోడ్డుపై కొనసాగుతున్న మార్కెట్(ఫైల్)

కాకతీయ కాలువకు నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల బుధవారం కొనసాగింది. డ్యామ్ నుంచి కాకతీయ కాలువ కు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు వదిలారు.

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల వాసులు



జీఆర్ దేశాయి



పీసీ హన్మంత్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ గౌరిశెట్టి రామూర్తి దేశాయి, పి. హన్మంత్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి ఈ ఎన్నికల్లో జీఆర్ దేశాయి రాష్ట్ర కార్యదర్శిగా, పి.హన్మంత్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక యినట్లు హరి అశోక్ కుమార్ తెలిపారు. వీరికి గురువారం జగిత్యాలలో పౌర సన్మానం జరపనున్నట్లు ఆయన తెలిపారు.

అర్బన్ బ్యాంకులో ఎన్నికల కోలాహలం





అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

- రెండో రోజు 35 నామినేషన్లు
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ
- రేపు పరిశీలన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకులో బుధవారం ఎన్నికల కోలాహలం కనిపించింది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజు బుధవారం 34 మంది అభ్యర్థులు 35 నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్‌కు అందించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డైరెక్టర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి మద్దతుదారులతో నామినేషన్లు ఎన్నికల అధికారికి సమర్పించారు. మాజీ చైర్మన్లు గడ్డం విలాస్‌రెడ్డి తన ప్యానల్‌లోని డైరెక్టర్ పదవులకు పోటీచేస్తున్న అభ్యర్థులతో కలిసి నామినేషన్లు వేయగా, కర్ర రాజశేఖర్ ఆయన మద్దతుదారులు, ఆయన ప్యానల్‌లోని డైరెక్టర్లతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను అందించారు. స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

మంగళవారం మొదటిరోజు ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా బుధవారం రెండో రోజు 34 మంది 35 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. మహిళా కేటగిరీలో ముద్దసాని శ్వేత, కంజర్ల రేణుక, మూల లక్ష్మీ, ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలకు లింగంపల్లి సత్యనారాయణ, అలుగు విద్యాసాగర్, సరిళ్ల రత్నకుమారి, బత్తుల రాజ్‌కుమార్, లింగంపల్లి శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. జనరల్ కేటగిరీలో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, బండి ప్రశాంత్ దీపక్, ఎడబోయిన శ్రీనివాస్, తాడ వీరారెడ్డి, ఎండి. కలీంఖాన్, ఎండీ బబ్లూ, కస్తూరి వరప్రసాద్, గుండ కిషన్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎండీ ముజీబ్‌హుస్సేన్, ఎలగందుల మునీందర్, ఇ లక్ష్మణ్‌రాజు, వొడ్నాల రాజు, బొమ్మరాతి సాయికృష్ణ, బాశెట్టి కిషన్, నాగుల సతీష్‌గౌడ్, దేశబోయిన వేదాద్రి, దరణికోట దామోదర్, మూల వెంకట రవీందర్‌రెడ్డి, కైలాస్ నవీన్, అనురాస్‌కుమార్, మంగి రవీందర్, లక్కిరెడ్డి కిరణ్, కూసరి అనిల్, నార్ల శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. ఉయ్యాల ఆనందం రెండ్లు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు.

బ్యాంకును అభివృద్ధి చేస్తాం

మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్

బ్యాంకు డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతోపాటు వాటిని వివిధ రకాల రుణాలను అందించి బ్యాంకును లాభాలబాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాము. మరోసారి అవకాశమిచ్చి ప్యానల్‌లోని అభ్యర్థులందరిని డైరెక్టర్లుగా గెలిపించాలి.

లాభాల బాటలో నడిపిస్తాం

మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

బ్యాంకును లాభాలతో ముందుకు తీసుకెళ్ళడమే ప్రధాన లక్ష్యంగా పోటీ చేస్తున్నాము. మాకు అవకాశమివ్వాలని కోరుతున్నాం. డిపాజిట్ల సేకరణతోపాటు ఆ డబ్బులను రుణాల రూపంలో సభ్యులు, ఖాతాదారులకు అందిస్తూ లాభాలను గడించేందుకు చర్యలు తీసుకుంటాం.

ముమ్మరంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు..



రాజన్న ఆలయ లడ్డూ గోదాంను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

- గంటపాటు రాజన్న దర్శనానికి అంతరాయం
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం రాజన్న దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఉదయం 10గంటల వరకు రాజన్న దర్శనాలకు భక్తులను అనుమతించారు. అంతరాలయంలోని గోపురాల పైకప్పున రేకులను తొలగించే క్రమంలో భక్తులపై పడకుండా ఉండేందుకు గంటపాటు దర్శనాలకు అంతరాయం కలిగింది.

అంతే కాకుండా మరో గంటపాటు స్వామి వారికి నివేదన ఉండటంతో రెండు గంటల సమయంలో గోపురాల పైకప్పు పెద్ద రేకులు, భారీ ఇనుప పైపులను తొలగించారు. రెండు గంటలపాటు దర్శనాలకు అంతరాయం కలగడంతో భక్తులు ఉత్తరం ద్వారం వద్ద రాజన్న దర్శనం కోసం నిరీక్షించారు. రేకులు తొలగించిన తదనంతరం భక్తులకు దర్శనాలను యథావిధిగా కొనసాగించారు.

రాజన్న, భీమన్న ఆలయాల్లో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దీంతో భీమన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. అంతే కాకుండా భక్తులు రాజన్న ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రచార రథం వద్ద సందడిగా కనిపించారు. ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

లడ్డూల గోదాం కూల్చివేత..



ఆలయం ముందు నుంచి భక్తుల దర్శనాలు

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా రాజన్న ఆలయం చుట్టూ ఉన్న భవనాలను ఇప్పటికే కూల్చివేశారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులకు పూర్తి స్థాయిలో పనులను అప్పగించడంతో ఆలయాన్ని ఆనుకుని ఉన్న లడ్డూల గోదాంను బుధవారం కూల్చి వేయడం ప్రారంభించారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ధర్మగుండం నుంచి ఆలయం ముందుకు వెళ్లేందుకు నిలిపివేశారు. భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకుండా వేగంగా అభివృద్ధి విస్తరణ పనులు చేపడుతూనే భక్తులకు దర్శనాలను అనుమతిస్తూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఈవో రమాదేవి..

వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈవో రమాదేవి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాజన్న ఆలయం ముందు తూర్పు ద్వారం నుంచి భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు. దీంతో ఆలయం ముందు స్వతహాగా గంటలపాటు క్యూలైన్‌లో వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈవోతో పాటుగా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రాజేందర్ ఆలయ ఉద్యోగులు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

రాజన్న సేవలో కేంద్ర మంత్రి సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. రాజరాజేశ్వర స్వామి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రమాదేవి అమ్మవారి వస్త్రాలు, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడలు ప్రారంభం





తిమ్మాపూర్‌లో ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు, గంభీరావుపేట మండలంలో విజేతలకు బహుమతులు అందజేత

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రాంగణంలో బుధవారం ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాలబాలికల ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 22 జట్టు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌ను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని ఓడిన వారు నిరాశ పడకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలని, గెలుపొందిన వారు మరింత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయంతో పాటు క్రీడా ప్రాంగణాన్ని అందించినందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్‌జీఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ వేణు గోపాల్‌రావు, ఎస్‌జీఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్‌రావు, డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్‌లు, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్- 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిజిల్లా నుంచి బాలుర, బాలికలు రెండేసి జట్ల చొప్పున మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతల బహుమతుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా కిసాన్ సెల్ జాయింట్ సెక్రెటరీ దమ్మ శ్రీనివాస్‌రెడ్డి నగదు అందజేశారు. రాజుపేటకు చెందిన మల్లేశం, కొత్తపల్లికి చెందిన షాదుల్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగారాం, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారాయణ, పీడీ భాను ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రాయికల్: రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని వేముల తన్వి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 16న సంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల బడ్డీ పోటీల్లో తన్వి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఏఈటీ వి.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దండారి ఉత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని బోర్నపెల్లి చిలుకగూడెంలో దీపావళి పండుగ సందర్భంగా గిరిజనులు దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు దండారి వేడుకల్లో భాగంగా చేసిన గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని గ్రామ దేవత జంగుబాయి దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా, మాజీ ము న్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, లత, రాజు, కవిత, శ్రీనివాస్, సత్యం, ముఖీద్, శ్రీనివాస్‌గౌడ్, గోపి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో నీట్, ఐఐటి బోధించే అధ్యాపకులు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రెగ్యులర్‌గా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ నిరసన తెలుపుతున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


కనగర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఇల్లంతకుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కోనరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి, వట్టిమల్ల గ్రామాల్లో కోనరావుపేట సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 240వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు. రైతులు తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కనగర్తిలో రైతుల సంఖ్య ఎక్కువని, వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని విప్ తెలిపారు. కార్యక్రమంలో డీసీవో రామకృష్ణ, కోనరావుపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, పాక్స్ ఛైర్మన్ బండ నర్సయ్య, వైస్‌ఛైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు రాజేందర్, వెంగళ వెంకన్న, మల్లారెడ్డి, నాయిని ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కర్రోల్ల భాస్కర్, గొట్టే రుక్మిణి, రావులపల్లి షైపాల్‌రెడ్డి, సాగర్, గంగయ్య, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : ధాన్యం దళారులకు విక్రయించవద్దని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగులలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయగా, బుధవారం ప్రభుత్వవిప్ ముఖ్యఅతిథిగా హాజరై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలకల తిరుపతి, వైస్ ఛైర్మన్ బొజ్జ మల్లేశం, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్ నాయకులు నాగం కుమార్, ధర్మపురి శ్రీనివాస్. రామిడి సాయి, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అనుపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాంపల్లి సింగిల్‌విండో ఛైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి డైరెక్టర్లు బొజ్జ భారతి, సిలివేరి సత్తయ్య, జడల రవీం దర్ నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, ప్రభాకర్‌రెడ్డి, ఆగయ్య, సత్తయ్య, రవీందర్, కత్తి కనుకయ్య భూమయ్య తదితరులు ఉన్నారు.

రైతులు నష్టపోవద్దనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● ఇల్లంతకుంట : రైతులు దళారుల బారినపడి నష్టపోవద్దనే అత్యధిక గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రేపాక, సోమారంపేట, వెంకట్రావుపల్లె, ఇల్లంతకుంట, జంగమరెడ్డిపల్లె, వెల్జీపూర్, రహీంఖాన్‌పేట తదితర గ్రామాల్లో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని సూచించారు. ఈసందర్భంగా హెల్ప్‌డెస్క్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏపీఎం లతామంగేశ్వరి, నాయకులు మామిడి రాజు, బొల్లవేని రమేష్, కాథ మల్లేశం, గుండ వెంకటేశం, రాజిరెడ్డి, సాగర్, సురేందర్‌రెడ్డి, మచ్చ రాజేశం, కూనబోయిన బాలరాజు, కాసుపాక శంకర్, సురేష్, తిరుపతిగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● బోయినపల్లి : రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని తడగొండ, కోరెం, బోయినపల్లి, మర్లపేట, విలాసాగర్, కొదురుపాక, మానువాడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిన ఎల్లేష్‌యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ జోగినపల్లి వెంకటరామారావు, వేసిరెడ్డి దుర్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వన్నెల రమ ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగుల వంశీ, కొడగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొను'గోల్లు'..

(5వ పేజీ తరువాయి)

సన్నరకం వైపు ఆసక్తి చూపారు. జిల్లాలో 12వేల ఎకరాల్లో సన్నరకం వరిసాగు చేశారు. దీని ద్వారా వచ్చే ధాన్యం దిగుబడిలో పౌరసరఫరాల కార్పొరేషన్ 9వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు అంచనా వేశారు.

కొనుగోళ్లలో జాప్యం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతి యాసంగి, వానకాలం సీజన్లలో ధాన్యం కొనుగోలులో జరిగే జాప్యంతో రైతులు ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు, మధ్య వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ధాన్యానికి గ్రేడ్ ఏ రకం రూ.2,389, కామన్ రకానికి రూ.2,369 మద్దతు ధర ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో కూడా అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసి నష్టపోవడం కంటే మద్దతు ధర కంటే తక్కువ అయినా మిల్లర్లు, మధ్య వ్యాపారులకు అమ్ముకోవడానికి రైతులు చూస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకంలో తరుగు తీయడం, తేమ సరిగాలేదని ఇబ్బందులు పెట్టడం వంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న రైతులు కొందరు వ్యాపారులకు క్వింటాలుకు రూ 1800 వరకు విక్రయిస్తున్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు


చంద్రంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలను దళారులకు అమ్మిమోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, ముష్టిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. అలాగే పెద్దూర్ గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో డైరెక్టర్‌లతో కలిసి చైర్మన్ జీల కిషన్‌యాదవ్ ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, వెల్ముల తిరుపతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాదర్‌పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్, మేనేజర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పాతూరి రాజిరెడ్డి, చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, నూనే శ్రీనివాస్, వంతడుప్పుల రాము, బాలరాజు, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్‌గౌడ్, అదిపెల్లి నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆనందం..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగిన గజ్జల ఆనందం చేసిన సేవ మరవలేనిదని ప్రజా సంఘాల నాయకులు అరుణ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటులో మృతిచెందిన సింగిల్ విండో డైరెక్టర్ ఆనందం దశదిన కర్మను కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనందం ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను తీర్చడంలో తన వంతు కృషి చేశారని అన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్, కొమురయ్య, నాగరాజు, నాంపల్లి, రంజిత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సరుకుల పక్కదారిపై ఈవో విచారణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయంలో సరుకులు పక్కదారిపై వచ్చిన ఆరోపణలపై ఈవో రమాదేవి విచారణ చేపట్టారు. ఈ మేరకు ఆలయ గోదాంలోని పలు సీసీ ఫుటేజీలను సేకరించి పరిశీలించినట్లు తెలిపారు. నిజా, నిజాలను నివేధిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించినట్లు పేర్కొన్నారు.

చందుర్తి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

చందుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను బుధవారం మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్ లు కలిశారు. చందుర్తి గ్రామంలో రైతులు ధాన్యం ఆరబోయడానికి 20ఎకరాల స్థలం కేటాయించలని, ప్రాథమిక సహకార సంఘం, ఐకెపి ఆధ్వర్యంలో ద్వారా రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో సెంట్రల్ లైటింగ్, మినీ క్రికెట్ స్టేడియంతో పాటు మోత్కరావుపేట రోడ్డును పూర్తి చేయలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ కుల సంఘాల అధ్యక్షులు సుద్దాల నర్సయ్య, బత్తుల శీనివాస్, నేరెళ్ల దేవయ్య, మోత్కుపల్లి మర్రి మల్లేశం, దేవయ్య. బత్తుల వసంతరావు లక్కర్సు రాజేశం, మర్రి చిన్న రాములు, మోతుకు తిరుపతి, మర్రి రెడ్డి, బత్తుల వంశీ, బత్తుల శ్రవణ్, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట మండలానికి రూ.25 కోట్లు మంజూరు

గంభీరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలానికి అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ వెల్లడించారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా మండలంలో బీటీ రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేయడం సంతోషమన్నారు. ముస్తాఫనగర్ నుంచి మాచారెడ్డి మండల సరిహద్దు వరకు, పెద్దమ్మ నుంచి నాగంపేట వరకు, నాగంపేట నుంచి లక్ష్మీపూర్ తండా వరకు, లింగన్నపేట నుంచి ముచ్చర్ల మీదుగా చీకోడ్ వరకు, కొత్తపల్లి ఎల్లమ్మ టెంపుల్ నుంచి జిల్లా సరిహద్దు వరకు, కోళ్ళమద్ది నుంచి శ్రీగాధ వరకు బీటీ రోడ్ల మరమ్మతుల కోసం 25 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గంభీరావుపేట మండలంలో బీటీ రోడ్ల మంజూరు చేసిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, నిధులు మంజూరు సహకరించిన కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్ రెడ్డిలకు ఈ సందర్భంగా ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు గౌరీ శంకర్, బంగ్ల రాజు, ప్రభాకర్, ఎలుక రాజు, విఠల్, బాలయ్య, కాశీరాములు, రాజశేఖర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : సీఐ

చందుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు తావులేకుండా వాహనాలను నడపాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం మూడపల్లిలో వాహనాల తనిఖీలో భాగంగా బుధవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో సీఐటీయూ జిల్లా మహాసభల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా సీఐటీయూ నాలుగో మహాసభలు ఈనెల 29, 30వ తేదీల్లో జరుగుతున్నాయని తెలిపారు. మహాసభలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన శ్రామికవర్గం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి ఉద్యమ పోరాటాల కార్యాచరణ రూపొందిస్తుందని అన్నారు. ఈ రెండు రోజులపాటు జరిగే మహాసభలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు సంస్థల్లో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులతో పాటుగా 28 రంగాల కార్మికులు వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొని వేలాది మందితో కార్మిక ప్రదర్శన, బహిరంగా సభ ఉంటుందని పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరిపెల్లి నరేష్, దొబ్బల లచ్చయ్య, వావిలాల లక్ష్మి, రాధ, మమత తదితరులు ఉన్నారు.

కల్లాలు లేక రైతులకు ఇబ్బందులు

- రోడ్లపై ధాన్యం ఆరబోతతో ప్రమాదాలు.. - 'ఉపాధి' కింద నిర్మాణాలకు అవకాశం ఇవ్వాలని వేడుకోలు


రోడ్డుపై ఆరబోసిన ధాన్యం


రహీంఖాన్‌పేటలో కల్లంలో ఆరబోసిన ధాన్యం

ఇల్లంతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం ఆరబోయడానికి కల్లాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో గతంలో కొన్ని భూములు బీళ్లుగా ఉండటం వల్ల ధాన్యాన్ని ఆరబోయడం కష్టంగా ఉండేది కాదు. ప్రస్తుతం రైతులు ఏమాత్రం స్థలాన్ని వదిలిపెట్టకుండా సాగుచేస్తుండటం వల్ల పండించిన ధాన్యాన్ని రోడ్లకు ఇరువైపులా ఆరబోస్తున్నారు. దీనితో రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితో రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కేంద్ర పభుత్వం పథకం అయిన ఉపాధిహామీలో మూడు సంవత్సరాలకు ముందు కల్లాల నిర్మాణాలకు అధికారులు అంగీకరించారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద కల్లాలు నిర్మించుకుంటే కొలతల ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రూ.80వేలు, ఇతరులకు రూ.70వేల వరకు అకౌంట్‌లో జమచేసేవారు. దీనితో మండలంలో 110మంది రైతులు కల్లాల నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో చేపట్టిన కల్లాలో ఇల్లంతకుంట మండలంలోనే యాభైశాతం నిర్మాణాలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపులో కొంత ఆలస్యం జరగడం, అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో పూర్తిస్థాయిలో రైతులు వినియోగించుకోలేకపోయారు. ఉపాధిహామీ పథకం కింద కల్లాల నిర్మాణాలు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. అప్పటినుంచి రైతులు పండించిన వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర ధాన్యం ఆరబోతకు రైతులు కష్టాలు పడుతున్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అవుతున్నా, ఆయా ప్రాంతాలు ఎగుడుదిగుడుగా ఉండటం వల్ల వర్షం పడితే ధాన్యం పూర్తిగా తడిసే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూముల్లో కల్లాలు నిర్మిస్తే తమకు ఉపయోగంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

కల్లాల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలి..

- పాశం రాంరెడ్డి, రైతు, పెద్దలింగాపూర్



రైతులకు వ్యవసాయ బావులవద్ద కల్లాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయి. గతంలో ఇచ్చినట్లు ఉపాధిహామీ పథకం కింద నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా ఉపయోగం ఉంటుంది. రోడ్లపై ధాన్యం ఆరబోస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి.. కానీ రైతులు ధాన్యాన్ని ఎక్కడ ఆరబోసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో సరైన స్థలం లేకపోవడం, అనేక గ్రామాల్లో ఎగుడుదిగుడులుగా ఉండటం వల్ల వర్షకాలంలో ధాన్యం తడిసిపోయే అవకాశం ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకవెళతా..

- పులి చంద్రయ్య, ఏపీవో, ఇల్లంతకుంట



మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు కల్లాలు కావాలని కోరుతున్నారు. రైతుల విన్నపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళుతా. గతంలో ఉపాధిహామీ పథకం కింద మండలంలోనే అత్యధికంగా కల్లాల నిర్మాణాలు జరిగాయి. రోడ్లపై ధాన్యాన్ని రైతులు ఆరబోయడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి దానిని చదును చేసుకొని ధాన్యాన్ని ఆరబోసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది.

రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో బీటీ రహదారుల నిర్మాణాలకు రూ.66 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నడుమ రవాణా మార్గం కల్పించి ప్రజల రహదారి కష్టాలను తీర్చడం కోసం అధిక నిధులను కేటాయిస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఆరు గ్రామాలకు రూ.22 కోట్లు, వీర్నపల్లి మండలంలోని ఆరు గ్రామాలకు రూ.22 కోట్లు, గంభీరావుపేట మండలంలోని ఆరు గ్రామాలకు రూ.24 కోట్లు విడుదల అయ్యాయని పేర్కొన్నార. నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, బాబు, బుచ్చాగౌడ్, వెంకటేశ్, రాంసింగ్, మల్లేశం, రాజునాయక్, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, రోగులకు పండ్లు పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్వేరోస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని వృద్ధులు, రోగులకు ఆ సంఘం సభ్యులు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన సేవామూర్తి ఎస్ఆర్ శంకరన్ అని అన్నారు. ఆయన ఆశయాల కోసం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్వేరోస్ సంస్థను ప్రారంభించారని అన్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికంతో పాటు జ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా స్వేరోస్ పని చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు సాయిచంద్, బాలసాయి, నిశాంత్, మధు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లోని ముస్లిం మైనార్టీ సంఘ భవనం, బీసీ సంక్షేమ వసతి గృహం ఆవరణలో బుధవారం బోరు బావి తవ్వకం, బోరు మోటారును స్థానిక నాయకులు ప్రారంభించారు. నారాయణపూర్‌లో ప్రభుత్వ నిధులతో బోరు బావి తవ్వకానికి ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం భూమి పూజ చేశారు. రాచర్లగొల్లపల్లిలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులతో వేసిన బోరుకు మోటారును స్థానిక బీజేపీ నాయకులు బిగించారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, షాదుల్లా, గణేశ్, నరేశ్, శ్రీశైలం, లక్ష్మణ్, యాదగిరి, ప్రకాశ్, రంజిత్‌కుమార్, నవీన్, రమేశ్, మధు, పవన్, యోగేందర్, వెంకటేశ్, అరవింద్, జితేందర్‌రెడ్డి, సాయికిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని కాంగ్రెస్ నాయకులు బీసీ, సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు బుధవారం విన్నవించారు. కరీంనగర్‌లో ఆయనను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి ప్రభాకర్‌గౌడ్ హామీ ఇచ్చారని చెప్పారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, శ్రీనివాస్, బాలకిషన్, నాంపల్లి, రవీందర్, రవితేజ తదితరులు ఉన్నారు.

సమీక్షా సమావేశాన్ని బహిష్కరించిన ఫీల్డ్‌అసిస్టెంట్లు

ఇల్లంతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశాన్ని ఫీల్డ్‌అసిస్టెంట్లు బహిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్‌అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందకుండా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చినా పరిష్కారం కావడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితులలో సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ శశికళకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సంఘ నాయకులు దమ్మని లక్ష్మన్, మంద రాజు, కూనబోయిన వేణు, విజయలక్ష్మి, రమ, జయశ్రీ, రజిత, మోహన్, అరుణ్, తిరుపతి, కనుకయ్య, శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

గంభీరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కోళ్ళమద్దిలో ఈనెల 24న శుక్రవారం నుంచి బాల ఆంజనేయస్వామి దేవాలయంలో ఉమా మహేశ్వరస్వామి పంచాయతన ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24 శుక్రవారం నుంచి 26 ఆదివారం వరకు జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనం, పుట్ట బంగారం తెచ్చుట, రక్షబంధనం, అఖండ దపారాధన గణపతి హోమం, ఆవాహిత దేవత హోమాలు, జలదీవాసం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఆదివారం అదివాసాంగ హోమం, ప్రతిష్ఠాంగ హోమం, గర్తన్యాసం యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మీలం, అష్టదిక్పాలకబలి, ధృక్‌బలి, మహాపూర్ణాహుతి, అవబృతస్నానం తదితర కార్యక్రమాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఉమా మహేశ్వరస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గల్ఫ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఆకుల శ్రీకాంత్‌గౌడ్ ఇటీవల మస్కట్ దేశంలో మృతిచెందగా, ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ చూపారని స్థానికులు బుధవారం పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారని చెప్పారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని యువకుడు శ్రీకాంత్ గౌడ్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యం స్పందించి సీఎంవో కార్యాలయానికి సమాచారం అందించారు. భారత రాయబార కార్యాలయం, గల్ఫ్ అధికారులతో చర్చించారు. స్పందించిన అధికారులు మృతదేహాన్ని ఈనెల 23న స్వగ్రామానికి పంపించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారన్నారు. మృతదేహం ఇంటికి చేరేలా ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ ఎన్నారై సెల్ బాధ్యుడు భీంరెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతలు ఆందోళన చెందవద్దు..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చూస్తామని, అన్నదాతలు ఆందోళన చెందవద్దని ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేశవ పెరుమాండ్ల స్వామి ఆలయం సమీపంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు కేంద్రంలో అన్ని వసతులు కల్పించి ధాన్యం సేకరిస్తామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కృష్ణారెడ్డి కోరారు. ఆయన వెంట నాయకులు నర్సింలు, రవీందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రజనీదేవి హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఆమె వాహన తనిఖీలను నిర్వహించారు. పలు వాహనాల పత్రాలను పరిశీలించారు. రోడ్డు పన్ను చెల్లించకుండా రహదారిపై ప్రయాణిస్తున్న ఐదు వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. అన్ని ధ్రువీకరణ ప్రతాలతో పాటు రహదారి పన్నులను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. తనిఖీలను ముమ్మరం చేసి వాహనాలపై కేసులు నమోదు చేస్తామని రజనీదేవి హెచ్చరించారు. ఆ శాఖ కానిస్టేబుల్ ఐలేశ్ ఉన్నారు.